


పరంధామయ్య కూర్చొని ఆలోచించు కొంటున్నాడు. భార్య కోరిక తీర్చలేని తన అసహాయతకు తన్ను తనే నిందించుకొంటున్నాడు. ఈ అసహాయతకు, ఈ దౌర్భాగ్యానికీ కారణం ఎవరో, ఎవరిని నిందించాలో తెలియడంలేదు. అతని ఆలోచనలు అయాచితంగా రెండు రోజులు వెనక్కు వెళ్ళాయి.

నవమాసాలు మోసి, కొడుకులను ప్రయోజకులుగా చేసిన పరంధామయ్య భార్య జానకి పరంధామయ్యతో ఇలా అన్నది —

''ఏమండీ ! మన కొడుకులు ప్రయోజకులైనారు కదండీ ! ఇంక మనకు పరవాలేదండీ ! కానీ నాకు ఈ వయసులో ఒకే ఒక్క కోరిక కలుగుతున్నాదండీ ? అన్నది.''

''నీకా ! జానకీ! కోరికా! ఈ సంసారాన్ని ఇన్నాళ్ళబట్టీ నడుపుతూ, మన పరిస్థితులు తెలుసుకొనికూడా నీవు ఏనాడూ ఏ కోరికా కోరలేదు. ఈనాడు కోరుతున్నావు ఏమిటి ?'' అన్నాడు పరంధామయ్య.

''అదికాదండీ! ఈ వయసులో పట్టుచీర కట్టుకొని, పండు ముత్తైదువలా ఉండాలని ఉందండీ. మన అబ్బాయిలను అడిగి నాకు చీర కొనిపెట్టండి చాలు'' అన్నది ఆ రోజు.

తనా బడిపంతులుగా చేసి రిటయిర్ అయ్యి మూలన కూర్చున్నవాడు. కొడుకులను అడగాలంటే సిగ్గు! ఎలా? తన భార్యకోసం ఆఖరుకు పెద్దకొడుకు ప్రసాద్‌ను అడిగాడు. ''ఒరే ప్రసాద్ మీ అమ్మ పట్టుచీర కావాలంటోందిరా! నేను కొందామంటే నా చేతిలో డబ్బుండదు. అందుకని నిన్ను అడగివలసి వస్తోందిరా'' అన్నాడు.

''అమ్మకా! ఈ వయసులోనా! పట్టుచీరా! మీకేమైనా మతిపోయిందా నాన్నా! అయినా పట్టుచీరంటే ఎంత తక్కువ ఆయినా అయిదు వందలు లేనిదేరాదు. చూస్తూ ఎలాగకొనేది ? నాకూ పెళ్ళాం, పిల్లలు ఉన్నారు కదా! లేకపోతే కొందును. అయినా తర్వాత ఎప్పుడో చూద్దాంలే'' అన్నాడు ప్రసాద్. రెండోకొడుకు సురేష్ వద్దకు వెళ్ళి అడిగితే అన్నాడు, ''అదేంటి నాన్నగారూ! మా దగ్గరేదో ఉన్నట్లు మాటాడుతారు, మేమేదో దాచుకొన్నాం అన్నట్లుగా! మా వద్ద ఏమీలేదు. నా భార్య సంవత్సరం నుంచీ అడుగుతోంది తనకు ''నెక్లెస్'' కొనమని. కానీ డబ్బుల్లేక కొనలేదు. ఇప్పుడు అమ్మకు పట్టుచీరా! తర్వాత చూద్దాంలెండి అయినా'' అన్నాడు.

కొడుకుల సమాధానాలతో బుర్ర తిరిగిన పరంధామయ్య మరి అడగడం మానేసాడు.

పెళ్ళాం, పిల్లలు అంటున్నాడు కదా పెద్దకొడుకు. వాళ్ళ చిన్నప్పుడు నేనుకూడా నాకు పెళ్ళాం అంటే ఇష్టమని, వీళ్ళ కోరికలు తీర్చడం మానేసి దాని కోరికలు తీరిస్తే ? వీళ్ళ

# పట్టు చీర

గతి ఏమిటి అవునో ఒక్కసారి ఆలోచించుకొంటే?

కన్నకొడుకు అంటే ఎంతో ప్రేమగా చూసి, తాను ఒకరోజు తింటూ, ఒకరోజు తినక వీళ్ళకు చదువు చెప్పించిన తరువాత, అమ్మ కోరిక తీర్చరా అంటే, నా పెళ్ళాంకే కొనలేదు అంటాడా ! అంటే వీడికి అమ్మ కంటే పెళ్ళాం ఎక్కువన్న మాట. వీళ్ళేదో ముసలితనంలో ఉద్ధరించేస్తారనుకోవడం పొరపాటు. ఈనాడు ఇద్దరు కొడుకులూ మంచి పొజిషన్‌లో ఉన్నారనుకొన్నా ఏమి ప్రయోజనం ? ఒకడికి సంసారం, మరొకడికి పెళ్ళాం.

ఇలా ఆలోచిస్తూ ప్రక్కనున్న మంచంమీద నడుం చేరవేసాడు. ఈసారి అతన్ని ఆలోచనా లోకంలోకి పోనివ్వకుండా కోడళ్ళ సంభాషణ ఆపుచేసింది. వింటూ కూర్చున్నాడు.

"ఈ వయసులో పట్టుచీరలేమిటి ? ఏ నారచీరో కట్టుకొని, జపమో, తపమో, చేసుకొంటూ మూలన కూర్చోక, పట్టుచీరలు కావలసివచ్చాయా వీళ్ళకు" చిన్నకోడలుతో అంటున్నది పెద్దకోడలు.

"ఇంకా నయం ! పట్టుచీరతో సరిపెట్టే సారు. పోనీ, అత్తగారు అని కొన్నా, రేపు "నెక్లెస్" కావాలంటారు. ఇక్కడేమైనా డబ్బులు రాసులు పోసుకు కూర్చున్నామను కున్నారో, ఏమో మరి" చిన్నకోడలు మాటలు ఇవి. ఆ మాటలు వింటూ తన భార్య జానకి కోరిన కోరిక ప్రభావం ఎలా పాకిందో ఆలోచించ సాగాడు. అతని ఆలోచన అతని పిల్లల చిన్నప్పటి నాటి మీదకు మళ్ళింది.

వాళ్ళు చిన్నపిల్లలుగా ఉండేటప్పుడు, తాను మాష్టరుగిరీ చేస్తున్నప్పుడు, తను తెచ్చే ముష్టి మూడు వందలుతో సంసారాన్ని ఎంతో గుట్టుగా నడిపి, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించిన తల్లి వారికీనాడు అక్కరలేకపోయింది.

చిన్నప్పుడు తను నెలాఖరురోజులలో ప్రసాద్ పదవతరగతి పరీక్షకు ఫీజు కట్టడానికి డబ్బులేకపోతే, ఏ స్త్రీ తీయని మంగళసూత్రం తీసి తాకట్టుపెట్టి, వాడికి ఫీజు కట్టిన సంగతి వాడు మర్చిపోతున్నాడేమో ? ఎంత కృతఘ్నులురా మీరు ? అయినా తనదే పొరపాటు. అవసానదశలో కొడుకులు ఏదో ఉద్ధరించేస్తారనుకొని, ఒకరోజు తినక వీరికి పెట్టడమే తప్పు. ఇలా ఆలోచించు కొంటూ ఉండగా తలుపుకొట్టిన శబ్దం అయింది. అది విని గతంలోంచి వర్తమానంలోకి వచ్చి, గడియ తీసారు. ఆఫీసులు వదిలేసారు లాగుంది ప్రసాద్, సురేష్ వచ్చేరు.

పరంధామయ్య లోపలకు వెళ్ళి లాల్చీ తొడుక్కొని బయటకు బయల్దేరుతుండగా పెద్ద కొడుకు గదిలోంచి వినబడుతున్న మాటలు విని ఆగిపోయాడు.

"శుభా ! మన అబ్బాయికి కాన్వెంట్‌లో సీటు వచ్చింది. అబ్బబ్బ! ప్రాణం పోయిందనుకో వాడికి సీటు వచ్చేసరికి. అయిదు వందలు "డొనేషన్" ఒకటి. ఏం చదువులో ఏమిటో ? ఇదిగో ఈ వెయ్యిరూపాయలూ తీసుకొనివెళ్ళి బీరువాలో పెట్టు. ఎరియర్స్ డబ్బూ అవీ వచ్చాయి. సాయంకాలం నీకు కావలసినవి కొంటాను." అంటున్నాడు. సరేలే అనుకొని గడియ తీసాడు పరంధామయ్య బయటకు వెళ్ళ డానికి. ఇంతలో ఇటుప్రక్క చిన్నకొడుకు గదిలోంచి వస్తున్న మాటలువిని ఆగిపోయాడు.

"ఇదిగో క్రిందటినెల అడిగావుగా "నెక్లెస్" ఇదం. ఏడువందల యాభై రూపాయలు అయింది దీన్ని చేయించడానికి" అంటున్నాడు చిన్నకొడుకు సురేష్.

"ఏమండీ ! బజార్లోకి కొత్తరకం చీరలు వచ్చాయట కొనండీ !" గోముగా అంటోంది చిన్న కోడలు.

"అలాగేలే మళ్ళీ నెల చూద్దాం. అదిసరే గాని నీవు త్వరగా తయారవ్. సినిమాకు పోదాం" అంటున్నాడు. మరింక వినడానికి మనస్కరించక వీధిలోకి నడిచారు పరంధామయ్య.

అతనికేమీ తోచడంలేదు. అయిదు వందలు పెట్టి భార్యకు పట్టుచీర కొనడం ఎలా ? పోనీ తనేమైనా ఉద్యోగం సంపాదిద్దామంటే, తనకు శక్తులన్నీ హరించి మూలాన పడ్డాడు. తనకు ఎవడు ఇస్తాడు ఉద్యోగం ? ఇలా ఆలోచిస్తూ వెళ్ళిపోతున్నాడు. మనశ్శాంతికోసం బయటకువస్తే ఇక్కడా ఈ ఆలోచనలే అని ఇంటికి తిరుగుముఖంపడుతూ అనుకొన్నాడు. రాత్రి పడుకొనే ముందు జానకి అడిగింది మళ్ళీ—

"ఏమండీ! మన అబ్బాయిలు ఏమంటు న్నారు" అని.

చెప్పడానికి తడబడిపోతున్నాడు పరం ధామయ్య.

"అలాగే కొంటాను అన్నారే, మీరు చూసు కొని" అన్నాడు.

"అయినా వాళ్ళను మరి అడగకండి. కొంటేకొంటారు లేకపోతే లేదు. వాళ్ళ అవస రాలు వాళ్ళకుంటాయి. ఒక తల్లిగా వాళ్ళచేత లేదనిపించుకోవడం అవమానంగా ఉంటుంది" అంది.

"లేదు జానకీ! ఈనాడు వాళ్ళ ఈ స్థితికి కారణం నీవే అన్న కృతజ్ఞత వాళ్ళకు ఉంది. తప్పక కొంటారు" అన్నాడు ముఖం ప్రక్కకు తిప్పుకొని.

"సరేలెండి" అని అటు ప్రక్క తిరిగి పడుకొంది జానకి.

ఎలాగయినా వాళ్ళను అడిగి కొనాలని నిర్ణ యించుకొన్నాడు. పెద్దకొడుక్కు ఏరియర్స్ డబ్బూ అవీ వచ్చేయంటున్నాడు కదా అందులోవి అడగాలి అని నిశ్చయించుకొని నిద్రపోయాడు.

మర్నాడు అడిగితే పెద్దకొడుకు "నా పిల్లాడికి కాన్వెంట్‌లో సీటువచ్చింది. వాడికి డబ్బుకట్టాలి. ఆ ఏరియర్స్ డబ్బు దానికి సరి పోతుంది. అయినా ఈ వయసులో పట్టుచీర లేమిటి నాన్నా! అడిగిన దానికి బుద్ధుండకపోతే మీకైనా ఉండొద్దా?" అడిగాడు ప్రసాద్.

రెండ్రోజులు అలా గడిచిపోయాయి. ఎక్కడ ఏ ఆధారము దొరక్క ఇంటికి వచ్చి జానకికి తన అసహాయతను వెల్లడిద్దామనుకొన్నాడు పరంధామయ్య. జానకి వద్దకు వెళ్ళి "జానకీ" అని పిల్చాడు. లేవలేదు. వంటిమీద చేయివేసి చూస్తే చేయి చురుక్కుమంటోంది. వెంటనే పెద్ద కొడుక్కు కబురు పంపి, వెళ్ళి డాక్టర్‌ను తీసుకు వచ్చాడు. డాక్టర్ వచ్చి "ఇంజక్షన్" చేసి మాత్రలు ఇచ్చి వెళ్ళాడు. పెద్దకొడుకు వచ్చి డాక్టర్ వ్రాసి ఇచ్చిన మాత్రలు తేవడానికి వెళ్ళాడు. తెచ్చేడు. సాయంత్రం దాకా స్పృహలో లేని జానకి సాయంకాలం కన్ను తెరిచింది.

"ఏమండీ! నాకేదో భయముగా ఉందండీ" తన బాధను చెప్పి బాధతో కనులు మూసుకొంది.

"జానకీ ! నేను అశక్తుణ్ణి. నీ కోరిక తీర్చ లేకపోయాను" అందామనుకొన్న పరంధామయ్య జానకి ముఖంలోకి చూసాడు. ఇందాక మూసిన కన్ను మరి తెరువబడలేదు.

"జానకీ ! నన్ను వదిలి వెళ్ళిపోయావా ?" అన్న పొలికేక వినిపించింది ఇంట్లో వాళ్ళకు. ప్రసాద్, సురేష్ వచ్చి ఆమె అంత్యక్రియలకు సన్నాహాలు చేసే పనిలో ఉండిపోయారు. ఆ సందడిలో ఎవరికీ కనిపించని పరంధామయ్యను ఎవరూ పట్టించుకోలేదు. అన్ని సన్నాహాలు పూర్తిచేసి పరంధామయ్య కోసం ఎదురు చూస్తుండగా, చేతిలో పాకెట్‌తో వచ్చాడు పరంధామయ్య. పాకెట్ విప్పి అందులోంచి "పట్టుచీర" తీసి పాడిమీద ఉన్న జానకి "శవం" మీద కప్పాడు. కప్పి, బాధ నిండిన హృదయముతో "జానకీ! ఇన్నాళ్ళూ నీ కోరిక తీర్చలేనందుకు క్షమించు. నీవు ఆనాడు ఏ తాళిబొట్టు తాకట్టు పెట్టి నీ కొడుక్కు విద్యాబుద్ధులు నేర్పించావో, అదే తాళిబొట్టు అమ్మి, నీకు ఈ "పట్టుచీర" తెచ్చాను. నాకు నీ శవం మిగిల్చావా జానకీ! ఇదిగో నీవు అడిగిన పట్టుచీర. చూడు జానకీ" అన్నాడు.

కానీ, పట్టుచీర చూసేందుకు ఆమె ఉంటేగా. ★


తాజా వార్తలకు

ఆంధ్రపత్రిక దినపత్రిక

చదవండి.